
ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY



విధుల్లో అలసత్వాన్ని ఉపేక్షించేది లేదు

▸ నిరంతర విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు ▸ ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.. అందుకోసం పైనుంచి కిందిస్థాయి వరకు కష్టపడి పనిచేస్తున్నాం.. విధినిర్వహణలో ఎవరైనా అలసత్వం ప్రదర్శించినా, ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు.. అలాంటి వారిపై శాఖాపర చర్యలు తీసుకుంటాం.. వచ్చే యాసంగి నాటికి వ్యవసాయ రంగానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కనెక్షన్లను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవల నూతనంగా ఎస్ఈగా బాధ్యతలు తీసుకున్న ఏ.వెంకటేశ్వర్లు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు. ఆయనతో ఇంటర్వ్యూ విశేషాలు ఇలా..

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ టౌన్)

ఆంధ్రజ్యోతి: నిరంతర విద్యుత్ సరఫరాకు తీసుకుంటున్న చర్యలు ఏమిటీ?

ఎస్ఈ: జిల్లాలో నిరంతర విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఓవర్‌లోడ్ ఉన్న చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం. లూజ్‌లైన్‌లు, లూప్‌లైన్‌ల స్థానంలో ఇంటర్మీడియల్ పోల్స్ వేస్తున్నాం. ప్రధానంగా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయానికి విద్యుత్ సరఫరా లోడ్‌ను మానిటరింగ్ చేస్తున్నాం.

ఆం: జిల్లాలో గృహజ్యోతి పథకంద్వారా ఎంత మంది లబ్ధిపొందుతున్నారు?

ఎస్ఈ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న గృహజ్యోతి పథకం ద్వారా జిల్లాలో 2,32,315 మంది వినియోగదారులు జీరో బిల్ లబ్ధి పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మరో 7,375 మంది అర్హులున్నా, చిన్న తప్పిదాలతో పథకం అమలుకావడం లేదు. వారందరి వివరాలను సంబంధిత ఏఈలకు పంపించాం. దీనికి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది.

ఆం: గృహజ్యోతి కింద లబ్ధిపొందని వారికి మళ్లీ అవకాశం ఉందా?

ఎస్ఈ: గృహజ్యోతి కింద లబ్ధిపొందని వారికి ప్రస్తుతమైతే అవకాశం లేదు. అది ప్రభుత్వ నిర్ణయం. 'ప్రజాపాలన' కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. సదరు స్లిప్‌తో సంబంధిత ఎంపీడీవో, మునిసిపాలిటీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

ఆం: వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్‌ను ఎలా తగ్గిస్తారు?

ఎస్ఈ: వచ్చే యాసంగి సీజన్ నాటికి వ్యవసాయ కనెక్షన్‌లకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానంగా అవసరం ఉన్న చోట...

- మిగతా 8వ పేజీలో...

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం



వర్షానికి ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో తడిచిన ధాన్యం (ఫైల్)

- పూర్తిస్థాయిలో ప్రారంభానికి నోచుకోని కేంద్రాలు
- అన్నిచోట్లా తెరవాలని రైతుల విన్నపం
- ఇప్పటివరకు 21వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- వర్షాల నేపథ్యంలో రైతుల్లో ఆందోళన
- పత్తిదీ అదే దారి

ఓ వైపు వర్షాలు, మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు లో జాప్యంతో రైతులు సతమతమవుతున్నారు. వరి కోతలు పూర్తయ్యి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసే కేంద్రాల ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద రాశులుగా పోసిన ధాన్యాన్ని వర్షం నుంచి రక్షించుకునేందుకు రైతులు నానా తిప్పలు పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

వరి నూర్పిడి పూర్తయిన రైతులు ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబోసి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఉదయం వేళ ధాన్యాన్ని ఆరబోసినా, రాత్రి వేళ కురుస్తున్న అకాల వర్షాలతో తేమ శాతంలో మార్పు రావడం లేదు. దీంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు సమయం పడుతోంది. మరోవైపు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కేంద్రాలను ప్రారంభించాలని అధికారులకు విన్నవిస్తున్నారు.

6.5లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు లక్ష్యం

5,15, 235 ఎకరాల్లో వరి సాగైంది. 12,01,540 మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుమతి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 6,36,816 మెట్రిక్‌టన్నుల సన్న ధాన్యం, 5,64,724 మెట్రిక్‌టన్నుల దొడ్డు ధాన్యం దిగుమతి అవుతుందన్నది అంచనా. కాగా, ప్రభుత్వరంగ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 6.5లక్షల మెట్రిక్‌టన్నులకు పైగా సేకరించాలన్నది అధికారుల లక్ష్యం. ధాన్యం ఏ-గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300గా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. జిల్లాలో 6.50లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలుకు ఐకేపీ, పీఏసీఎస్, ఏఎంసీల ఆధ్వర్యంలో మొత్తం 365 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కాగా, ఇప్పటి వరకు పూర్తిసాయిలో కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. ఇప్పటివరకు 21వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వరంగ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో సేకరించారు.

నత్తనడకన కొనుగోళ్లు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు మొత్తం 365 కేంద్రాలు ప్రారంభించాల్సి ఉంది. కాగా, అక్కడక్కడ తెరుచుకున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికే నాన్ ఆయకట్టులో పెద్ద మొత్తంలో వరి కోతలు సాగుతుండగా, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావడం ప్రారంభమైంది. ప్రభుత్వరంగ సంస్థలు ఎటువంటి ఆటంకం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తాయని రైతులు భావించినా, ఆశించిన విధంగా కొనుగోళ్లు జరగడం లేదు. అధికారులు మాత్రం వర్షాలు పడుతుండటం వల్లే కొనుగోళ్లు నెమ్మదించాయని పేర్కొంటున్నారు.

రైతులు మాత్రం కేంద్రాల్లో వేగవంతంగా కొనుగోళ్లు జరగడంలేదని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. ఓ వైపు వర్షాలతో ధాన్యం తడుస్తుండగా, టార్పాలిన్ల పంపిణీని మార్కెటింగ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. గోనెసంచుల కొరతతో సకాలంలో ధాన్యం ఎగుమతి కాకుండా కేంద్రాల్లోనే నిల్వ ఉంటోంది.

పత్తి కొనుగోళ్లపై నీలి నీడలు



పత్తి కొనుగోళ్లపై నీలి నీడలు అలుముకున్నాయి. 10 రోజుల క్రితం పత్తి కొనుగోలును అధికారులు లాంచనంగా ప్రారంభించినా సీసీఐ నేటికీ రంగంలోకి దిగలేదు. జిల్లాలో 22కు పైగా ఉన్న జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలుకు నిర్ణయించింది. అయితే అధికారులు ప్రకటించడం మినహా, ఇప్పటి వరకు ఎక్కడా కొనుగోలు ప్రారంభం కాలేదు. ప్రభుత్వరంగ సంస్థలకు పత్తి విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని రైతులు ఆశించినా వారికి నిరాశే మిగిలింది. ఇదే..

- మిగతా 8వ పేజీలో...

న్యూస్ బాక్స్

థర్మల్ విద్యుత్ రైల్వేలైన్ ట్రయల్‌రన్ విజయవంతం



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

దామరచర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమకు బొగ్గు సరఫరా కోసం ఏర్పాటు చేసిన నూతన డబుల్ రైల్వేలైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. శుక్రవారం జెన్‌కో అధికారులు, రైల్వే అధికారులు రైలు ఇంజన్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. విష్ణుపురం నుంచి పరిశ్రమవరకు సుమారు 8కిలోమీటర్ల మేర రైల్వేలైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ట్రయల్ రన్ సైతం విజయవంతం కావడంతో అధికారులు హర్షం వ్యక్తం చేశారు. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు విద్యుత్ యూనిట్లలో ఇప్పటికే రెండు పూర్తిగా మిగిలిన మూడు యూనిట్ల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో రైల్వేలైన్ నిర్మాణం సైతం పూర్తి కావడంతో బొగ్గు సరఫరాకు మార్గం సుగుమమైంది.

బీవెల్లెంల రిజర్వాయర్‌లోకి నీటి విడుదల



బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీరు

నార్కట్‌పల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణవెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి ప్రాజెక్టు అధికారులు శుక్రవారం సాయంత్రం నీటి విడుదలను ప్రారంభించారు. గత నెలలో పానగల్ ఉదయసముద్రం రిజర్వాయర్‌లో తగినంత నీటి లభ్యత లేక బ్రాహ్మణ వెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు పంప్‌హౌస్‌లోని మోటర్లు ట్రయల్ రన్‌కే పరిమితమైంది. ప్రస్తుతం ఉదయసముద్రం రిజర్వాయర్‌లోకి వరద జలాల రాక పెరడగంతో పాటు పాటు భారీ గా కురిసిన వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే పలు గ్రామాల చెరువుల్లోకి నీరు కూడా వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ సూచనల మేరకు ప్రాజెక్టు అధికారులు బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్‌లోకి నీటి విడుదలను ప్రారంభించారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 0.3 టీఎంసీలు కాగా తొలుత 0.2 టీఎంసీల మేర నింపనున్నారు. ఈ మేరకు రోజూ 2 మోటార్లను పగటిపూటే నడుపుతూ నాలుగు రోజుల్లోగా రిజర్వాయర్‌కు 0.2 టీఎంసీల మేర నీటిని పంపింగ్ చేయనున్నారు. సోమవారం నుంచి రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల తవ్వకం పనులను కూడా ప్రారంభించనున్నట్లు సమాచారం.

ఆయిల్‌పామ్ సాగు పెంచేలా కృషి చేయాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

నల్లగొండ, నల్లగొండ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వ్యవసాయ విస్తరణ అధికారి నవంబరు 10లోపు తన పరిధిలో కనీసం 150 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసేలా కృషి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్ తోటలను పెంచడం రైతులకు మంచి అవకాశమని, ఈ పంటతో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్‌పామ్‌కు మార్కెట్ ఉంటుందో లేదో అని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ముందస్తుగానే రైతులతో ఒప్పందం కుదుర్చుకుంటుందన్నారు. ధరను కూడా ప్రభుత్వమే నిర్ణయిస్తుందని, ఇప్పటికే 10వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోందన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు మరో 15వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పండిస్తే సంక్రాంతి నాటికి జిల్లాలో కంపెనీ ఎక్కడా పెట్టాలో ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. అధికారులు ఉత్సాహవంతులైన రైతులను గుర్తించి డీడీలు తీయించాలన్నారు. వర్షాల కారణంగా ధాన్యం కొనుగోలు కొంత మందగించిందని, ఈ నెల 26 తరువాత వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సాయిబాబా, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్, ట్రైనర్ సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలి

గ్రామీణ, మునిసిపల్ పట్టణ ప్రాంతాల్లో వారం, పది రోజుల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పూర్తిచేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వచ్చే వారం నాటికి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, వనమహోత్సవం, మొక్కల సంరక్షణ, తాగునీరు, విద్యుత్ పనులు నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించేందుకు కృషి

ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనుముల మండలం మదారిగూడెం గ్రామంలో వర్షంతో నేలవాలిన పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేయగా, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఏవో సరిత, హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, కుందూరు వెంకట్‌రెడ్డి, పోషం శ్రీనివాస్‌గౌడ్, రిక్కల కరుణాకర్‌రెడ్డి, రిక్కల వెంకట్‌రెడ్డి, నకిరేకంటి సైదులు, శోభన్‌బాబు, సర్వర్, ఇబ్రహీం, చెన్ను వెంకట్‌రెడ్డి, శేఖర్, ఫక్రుద్దీన్, రబ్బాని, వెంకయ్య, తదితరులు ఉన్నారు.



నిడమనూరు మండలంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం కృషి

గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హాలియా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 100మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గీత కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి హైదరాబాద్ ఐఐటీ విద్యార్థులతో రూపొందించిన రక్షణ కిట్లను పంపిణీ చేస్తోందన్నారు. గతంలో రక్షణ కిట్లు లేక ప్రమాదవశాత్తు మృతి చెందిన వారు. వైకల్యానికి గురైన వారు చాలా మంది గీత కార్మికులు ఉన్నారన్నారు. గత ప్రభుత్వం గీత కార్మికులను విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో అంకతి సత్యం, ఎక్సైజ్ సీఐ కల్పన, నాంపల్లి సీఐ సైదులు, నాయకులు కాకునూరి పెదనారాయణగౌడ్, భాస్కర్‌నాయక్, కృష్ణానాయక్, కాసాని చంద్రశేఖర్, రాజాప్రసాద్, పిల్లి ఆంజనేయులు, గౌని రాజారమేష్‌యాదవ్, వెంపటి శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు .. పరిహారం ఇప్పిస్తాం

(ఆంధ్రజ్యోతి, నిడమనూరు): వర్షాలతో పంట నష్టపోయిన రైతులు ఎవరూ అధైర్య పడవద్దని, ప్రతీ ఒక్కరికి పరిహారం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని గుంటుకగూడెం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. 1,370 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మునికృష్ణయ్య, ఏఈవో క్రాంతికుమార్, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, నందికొండ మట్టారెడ్డి, బొల్లం శ్రీనివాస్‌యాదవ్, నూకల వెంకట్‌రెడ్డి, పగిళ్ల శివ, ఆలంపల్లి మైసయ్య, మేరెడ్డి వెంకటరమణ, ఆలంపల్లి కృష్ణ, సింగం రామలింగయ్య, మేరెడ్డి రాజిరెడ్డి, గొంగటి శ్రీనివాస్, వీరేశం, తరి నర్సింహ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు

▸ చింతపల్లి సాయినాథునికి దర్శించుకోని పూజలు ▸ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

చింతపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమంలో నిర్వహించారు. మొత్తం 25 మంది నుంచి అర్జీలు తీసుకొని బాధితులతో మాట్లాడారు. వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికం భూవివాదాలు, భార్య, భర్తల పంచాయితీలకు చెందినవే అధికంగా ఉన్నాయి. ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో ఒక రోజు 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దీంతో పోలీసులపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. కాగా, దళారులతో కుమ్మకై రైతులను మోసం చేస్తున్న జిన్నింగ్ మిల్లు యజమానిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్ ఫిర్యాదు చేశారు. కార్య క్రమంలో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, నాంపల్లి సీఐ నవీన్, ఎస్ఐ యాదయ్య, పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయాన్ని దర్శించిన ఎస్పీ

షిర్డీసాయి బాబా ఆలయాన్ని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఎస్పీని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కామిరిశెట్టి వెంకటయ్య, పూరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్, తదితరులు ఉన్నారు.

విమర్శలు మాని పట్టణ అభివృద్ధిపై దృష్టి పెట్టండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.సలీం

నల్లగొండ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్ విమర్శలు మాని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.సలీం హితవు పలికారు. స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి దృష్టి పెట్టకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నాయని, తిట్ల పురాణంతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాయని అన్నారు. 1997లో నంద్యాల నరసింహారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో సందెనపల్లిలో గొర్రెల మేకల విక్రయానికి సంత, ఆయుర్వేద మొక్కల ప్లాంటేషన్ కోసం కొనుగోలు చేసిన భూమిని కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలిచాక డంపింగ్ యార్డ్‌గా మార్చారని ఆరోపించారు. దాని నుంచి వచ్చే కాలుష్యాన్ని నివారించడానికి శాస్త్రీయ పద్ధతిని ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. 2004-05లో కాంగ్రెస్ ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్మన్ ఆ స్థలాన్ని డంపింగ్ యార్డ్‌గా మార్చిన కాంగ్రెస్ ఇప్పుడు విమర్శలు చేస్తోందని అన్నారు. ఆ భూమిని దేనికి కొనుగోలు చేశారో తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు ఉంటాయని, వాటిని పరిశీలించుకోవాలని అన్నారు. పట్టణంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటుచేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నేటికీ పూర్తి కాలేదని, కొత్త ప్రాంతాలకు విస్తరణ పేరుతో మరో రూ.100కోట్లతో పనులు చేపడుతున్నారని అన్నారు. దీనితో ప్రజా ఉపయోగం లేదని అన్నారు. ఇరు పార్టీలు తిట్ల పురాణంతో ప్రజల దృష్టి మళ్లిస్తున్నాయని విమర్శించారు. ఒకరిపై ఒకరు విమర్శలు మాని పట్టణ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు పుచ్చకాయల నర్సిరెడ్డి, తుమ్మల పద్మ, పట్టణ కమిటీ సభ్యులు గాదె నరసింహ, అద్దంకి నర్సింహ, మారగోని నగేష్, కోట్ల అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గురు సంకల్పం..గుడి నిర్మాణం

- రూ.5 కోట్ల సొంత డబ్బులతో పట్టాభిరామాలయం, మహాలక్ష్మీ ఆలయాల నిర్మాణం
- శ్రీరామదూత సేవా సమితి ట్రస్టు పేరిట ఆధ్యాత్మిక కార్యక్రమాలు

గురు సంకల్పం నెరవేరుస్తూ, రాముడి సేవకే అంకితమనేలా ఆలయానికి సేవలందిస్తున్నారీ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చిన్నతుమ్మలగూడెం గ్రామానికి చెందిన ఉండ్ర లింగారెడ్డి, భాగ్యమ్మ దంపతులు. మండలంలోని మాండ్ర శివారులోని పట్టాభి రామాలయం, మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయాలను కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో సుమారు రూ.5 కోట్ల అంచనాతో నిర్మించారు. ఆలయ నిర్మాణ విషయంలో జైలుకు కూడా వెళ్లివచ్చారు. ఇప్పుడిప్పుడే భక్తులను విశేషంగా ఆకర్షిస్తూ ప్రాచుర్యంలోకి వస్తున్న ఆలయాలు నెలకొన్న 'అనంత స్వర్ణగిరి' ఆలయ పునర్నిర్మాణ దాతల ఆధ్యాత్మిక గమనంపై కథనం

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

నార్కట్‌పల్లి మండలం చిన్నతుమ్మలగూడెం గ్రామానికి చెందిన ఉండ్ర లింగారెడ్డి, భాగ్యమ్మ దంపతులది వ్యవసాయాధారిత కుటుంబం. వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూమిలో పంటలు, తోటల సాగు చేస్తున్నారు. వీరికి చెందిన భూమి పక్కనే ఓ చిన్నపాటి గుట్ట ఉంది. ఆ గుట్టపై పూర్వకాలంలో రాముడి ఆలయం ఉండి పూజలు జరిగిన ఆనవాళ్లను గుర్తించి, ఈ విషయాన్ని తమ బంధువుల వద్ద ప్రస్తావించారు. దీనికి తోడు ఆలయం గురించి తెలిసిన అనంత పద్మనాభ యాదగిరి అనే గురూజీని సంప్రదించారు. 2008లో స్థలాన్ని పరిశీలించి మునులు, రుషులు తపస్సు చేసిన పవిత్ర స్థలమని వివరించారు. వెయ్యేళ్ల క్రితమే కాకతీయుల రాజుల పాలనలో ఇక్కడ సీతారాముల ఆలయం నిర్మించి పూజలు చేసినట్లు అక్కడ లభించిన ఆనవాళ్లను బట్టి తెలుసుకుని అక్కడే గుడి కట్టాలని సంకల్పించారు. పట్టాభిషక్తులైన సమయంలో ఆసీనులైన మాదిరి సీతాసమేత రామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించాలని నిర్ణయించారు.

స్థలం వివాదంలో చిక్కుకుని...

రామాలయ ఆలయ స్థల విషయంలో వివాదం తలెత్తడంతో గురువు అనంత పద్మనాభయాదగిరి స్వామి వెనకడుగు వేశారు. దీంతో ఆ సంకల్పాన్ని ఉండ్ర లింగారెడ్డి దంపతులు తీసుకున్నారు. పనులను చేపట్టిన క్రమంలో ఆలయ స్థలంపై అధికారులు కోర్టుకు వెళ్లారు. ఈ కేసులో దంపతులు భువనగిరి సబ్‌జైలులో రెండు రోజుల పాటు జైలు జీవితం గడిపారు. అనంతరం కోర్టులో కేసు కొట్టివేశారు. ఈ క్రమంలో 2014లో పద్మనాభ స్వామి శివైక్యం చెందారు.





పట్టాభి రామాలయం, గర్భాలయంలోని మూర్తులు

సంకల్పాన్ని నెరవేర్చమని కలలో చెప్పిన గురువు

అనంత పద్మనాభ యాదగిరి మరణంతో ఆలయాల నిర్మాణం ఆగిపోయింది. ఏళ్లు గడిచినా ఆలయాల నిర్మాణంపై శ్రద్ధ చూపలేదు. ఈ సమయంలో హఠాత్తుగా ఓ రోజు లింగారెడ్డికి గురువు యాదగిరిస్వామి కలలోకి వచ్చి ఆలయాల నిర్మాణం చేపట్టాలన్న తన సంకల్పాన్ని నెరవేర్చాలంటూ కోరారు. పైగా కోర్టులో నడుస్తున్న కేసు కూడా కొట్టివేయడంతో ఆలయాల నిర్మాణానికి దంపతులు సిద్ధమయ్యారు. 2021లో మొదలుపెట్టిన ఆలయాల నిర్మాణం 2023 నవంబరు నాటికి పూర్తయ్యే దశకు చేరుకుని విగ్రహ ప్రతిష్ఠాపన అంగరంగవైభవంగా జరిగింది. గుట్టపైన పట్టాభిరామాలయం, గుట్ట కింద మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయాల నిర్మాణానికి 2010లో భూమి పూజ చేశారు.

తమిళనాడు శిల్పులతో

ఆలయాల నిర్మాణంలో నైపుణ్యం గాంచిన తమిళనాడుకు చెందిన శిల్పులతో ఆలయాల నిర్మాణం మొదలుపెట్టారు. అటు మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహంతో పాటు పట్టాభి సీతారాముల విగ్రహాల తయారీకి మహాబలిపురంలోని కృష్ణశిలనే వాడారు. పట్టాభి సీతారామచంద్రుల విగ్రహాలు రెండు మెట్రిక్ టన్నుల బరువుతో ఎనిమిది ఫీట్ల ఎత్తుగా తయారుచేశారు. 1.5 టన్నుల బరువుతో ఫీట్ల పొడవుండేలా తీర్చిదిద్దగా మూర్తీభవించిన మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహం భక్తులను తన్మయులను చేసేలా ఉంది.

సొంత నిధులు రూ.5 కోట్లు

పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని కుటుంబ సభ్యుల సహకారంతో సుమారు రూ.5 కోట్ల సొంత నిధులతో కట్టాం. ఇందుకోసం ఆరు ఎకరాల భూమిని విక్రయించాం. ఇంకా కొంత పని మిగిలిఉంది. రాజగోపురాలు, ప్రాకారాలు, ప్రహరీ గోడలు నిర్మించాల్సి ఉంది. అయితే ఆలయ నిర్మాణంలో ఇప్పటివరకు మా కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారమే తప్ప ఇతరుల నుంచి విరాళాలు సేకరించలేదు. స్వామి, అమ్మవార్ల అనుగ్రహం ఉంటే భవిష్యత్‌లో నవగ్రహ మంటపంతో పాటు వేద పాఠశాల, నిత్యాన్నదాన సత్రం, నెలకొల్పాలని యోచిస్తున్నాం. శ్రీరామదాసు సేవా సమితి పేరిట భక్తులకు సేవలందిస్తాం.



ఉండ్ర లింగారెడ్డి, భాగ్యమ్మ, ఆలయ నిర్మాణ దంపతులు

స్వర్ణగిరి నుంచి అనంత స్వర్ణగిరిగా మార్పు


తొలుత స్వర్ణగిరిగానే ఈ ప్రదేశం ప్రాచుర్యమైంది. కానీ భువనగిరి శివారులో ఇటీవల అద్భుతంగా నిర్మితమైన భక్తుల స్పందనతో అలరారుతున్న వేంకటేశ్వరుడి ఆలయ ప్రదేశాన్ని కూడా దాతలు 'స్వర్ణగిరి'గా నామకరణం చేశారు. అయితే భక్తులకు ఏమాత్రం అయోమయం కలగకుండా ఆలయ నిర్మాణ సంకల్ప గురువైన అనంత పద్మనాభస్వామి పేరిట 'అనంత స్వర్ణగిరి'గా మార్పుచేశారు. ఈ ఆలయంలో నిత్యారాధనలతో పాటు ప్రతీ శుక్రవారం కుంకుమ పూజ నిర్వహిస్తున్నారు.



ఆదర్శం

స్ఫూర్తిదాయకం

- ఉద్యోగాల వైపు యువతను ప్రోత్సహిస్తున్న ఐఏఎస్ శరత్‌కుమార్
- నెస్ట్స్ స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికపై పలువురి హర్షం



పుట్టింది పేద గిరిజన కుటుంబంలో, కష్టాలను అధిగమిస్తూ పట్టుదలతో చదువుల్లో రాణించారు. అతడి లక్ష్యమైన సివిల్స్‌కు ఎంపికై ఐఏఎస్‌గా వివిధ హోదాల్లో సేవలు అందించారు. ఆయనే జాతీయ గిరిజన విద్యార్థుల విద్యాసంఘం (నెస్ట్స్) స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన అడావత్ శరత్‌నాయక్. ఆయన ప్రయాణం స్ఫూర్తిదాయకం. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని పలువురు యువకులు ప్రభుత్వ కొలువులు సాధించడం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి- దామరచర్ల)

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం పూర్వపు కొండ్రపోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని పర్తునాయక్‌తండాకు చెందిన అడావత్ సోనిమా, సక్కు దంపతులకు ఆరుగురు కుమారుల్లో శరత్‌నాయక్ రెండోవాడు. చిన్నతనం నుంచి చదువుల్లో చురుకైన ఆయన 7వ తరగతి వరకు స్థానిక కొండ్రపోల్ పాఠశాలలో విద్యనభ్యసించి ఆపై నాగార్జునసాగర్‌లో ఇంటర్ వరకు, నిజాం కళాశాలలో బీకాం పూర్తిచేశారు. 1996లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. మొదటి పోస్టింగ్ మహబూబ్‌నగర్ ఆర్డీవోగా పనిచేశారు. ఆ తర్వాత చిత్తూరు జిల్లా కుప్పం ప్రత్యేక అధికారిగా, మదనపల్లి, గుంటూరు సబ్‌కలెక్టర్‌గా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా, సంగారెడ్డి, మెదక్ జాయింట్ కలెక్టర్‌గా, తరవాత కాలంలో కలెక్టర్‌గా వివిధ జిల్లాల్లో పనిచేశారు. రాష్ట్ర మార్కెటింగ్ గిడ్డంగుల శాఖ, పంచాయతీరాజ్ కమిషనర్‌గా పనిచేశారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తుండగా ఇటీవల జాతీయ గిరిజన విద్యార్థుల విద్యా సంఘం(నెస్ట్స్) స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా శరత్‌నాయక్‌ను నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవీలో ఏడాది పాటు బాధ్యతలు నిర్వహిస్తారు.

తల్లిదండ్రులకు ఆలయం

తన ఉన్నతికి అహర్నిషలు కష్టపడిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలని సంకల్పించిన శరత్‌నాయక్ సోదరుల సహకారంతో గ్రామంలోని వ్యవసాయ క్షేత్ర ంలో తల్లిదండ్రులైన సోనిమా, సక్కునాయక్‌లకు ఆల యం నిర్మించారు. పండుగలకు తల్లిదండ్రుల ఆల యం వద్ద కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

ఎందరికో చేయూత

శరత్‌నాయక్‌ను ఆదర్శంగా తీసుకుని ఈప్రాంత యువత ప్రభుత్వ కొలువులు సాధించారు. వారిని ప్రోత్సహించడంతో పాటు చేయూతను అందించి వారి లక్ష్యాలను సాధించే దిశగా ఆయన కృషి చేస్తున్నారు. గ్రామంలో జరిగే శుభకార్యాలకు వచ్చే ఆయన సామాన్యుడిలా జనాల్లో ఉంటూ వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకుంటూ వారిని ప్రోత్సహిస్తుంటారు.

పలు సేవా కార్యక్రమాలు



శరత్‌నాయక్ సొంత నిధులతో ఏర్పాటుచేయించిన బస్‌షెల్టర్

కొండ్రపోల్‌లో తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి శరత్‌నాయక్ సహకారం అందిస్తున్నారు. రూ.10లక్షలతో తరగతి గదులను తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్మించారు. ప్రతీ ఏటా విద్యార్థులకు పాఠశాలలో నోట్ పుస్తకాలను అందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలను చేస్తున్నారు. పర్తునాయక్‌తండా ప్రజల సౌకర్యార్థం బస్‌షెల్టర్‌ను నిర్మించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాడేరు ఏజెన్సీలో వాటర్ ప్లాంట్ నిర్మాణంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టడంతో ఆ ప్రాంతానికి శరత్‌నగర్‌గా ఆయన పేరునే స్థానికులు పెట్టుకున్నారు.

నవంబరు 1న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

నల్లగొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో కబడ్డీకి సంబంధించి బాల, బాలికల జట్టును ఎంపిక నవంబరు 1వ తేదీన చేపడుతున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లాల అండర్-19 ఎస్జీఎఫ్ కార్యదర్శి ఇందిరా ఒక ప్రకటనలో తెలిపారు. హాలియాలో ప్రభుత్వ పాఠశాలలో జట్ల ఎంపిక జరుగుతుందన్నారు.ఉదయం 9గంటల నుంచి ఈ కార్యక్రమం చేపడుతామని ఆసక్తి ఉన్న క్రీడాకారులు బోనోఫైడ్‌తో పాటు 10వ తరగతి మెమోతో హాజరుకావాలని తెలిపారు.

మూసీ ప్రక్షాళనను ఎవరూ ఆపలేరు: సామేల్

మోత్కూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావులే కాదు వారి తాతలు దిగొచ్చి, అడ్డుపడినా మూసీ ప్రక్షాళన ఆగదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన చేయాలన్న డిమాండ్‌తో యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం మానాయకుంట-గురిజాల మధ్య ఉన్న మూసీ బ్రిడ్జి వద్ద ఈ నెల 27న నిర్వహించే బహిరంగ సభకు స్థలాన్ని శుక్రవారం పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. తన చిన్నతనంలో మూసీ నీటిని తాగేవారమన్నారు. అలాంటి నీరు ఇప్పుడు కలుషితమై, ఆ నీటితో పండించిన పంటలు తినలేని దుస్థితి ఏర్పడిందన్నారు. మూసీ ప్రక్షాళన వద్దనే బీఆర్‌ఎస్ నాయకులు వారి ప్రభుత్వంలో మూసీ ప్రక్షాళనకు రూ.25వేల కోట్లు కేటాయించి, మూసీ రివర్ ప్రాజెక్టును ఏర్పాటుచేసి దానికి సుధీర్‌రెడ్డి చైర్మన్‌గా ఎందుకు చేశారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన కోసం ఈ నెల 27న మానాయకుంట బ్రిడ్జి వద్ద 10వేల మందితో సభ నిర్వహిస్తున్నామని, మోత్కూరు, అడ్డగూడూరు, శాలిగౌరారం మండలాల నుంచి ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. తనతో పాటు భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభకు జిల్లా మంత్రులను, మూసీ పరివాహక ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తామన్నారు. అడ్డగూడూరు, తుంగతుర్తి మండలాలకు ఐటీఐ కళాశాలలు మంజూరయ్యాయన్నారు. సమావేశంలో అడ్డగూడూరు, మోత్కూరు సింగిల్‌విండోల చైర్మన్లు కొప్పుల నిరంజన్‌రెడ్డి, పేలపూడి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పొలెబోయిన లింగయ్య యాదవ్, వంగాల సత్యనారాయణ, సమరంరెడ్డి, నాయకులు ఇటికాల చిరంజీవి, అన్నెబోయిన సుధాకర్, చామల అనిల్‌రెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, సత్యనారాయణ, వేణుగోపాల్‌రెడ్డి, జోజి ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరుకు నిధులు మంజూరు చేయిస్తా

మోత్కూరు మునిసిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం త్వరలోనే మరో రూ.10 కోట్లు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే సామేల్ హామీ ఇచ్చారు. కార్యాలయంలో జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే మంజూరైన పనులు, మెయిన్ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కమిషనర్ సి.శ్రీకాంత్, వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సన్నాలకు రూ.500 ప్రభుత్వ బోనస్

మోత్కూరు వ్యవసాయ మార్కెట్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సామేల్ ప్రారంభించారు. సన్న ధాన్యానికి ప్రభుత్వం అదనంగా రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, సంఘం సీఈవో కె.వరలక్ష్మీ, మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు, నాయకులు గుండగోని రామచంద్రు, పైళ్ల సోమిరెడ్డి, అవిశెటిట అవిలిమల్లు, కోమటి మత్స్యగిరి, అన్నెపు పద్మ, కుర్మిళ్ల ప్రమీల పాల్గొన్నారు.

గాజులమ్మ తల్లిగా దర్వేశిపురం ఎల్లమ్మ



అమ్మవారికి గాజులతో అలంకరణ

కనగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు శుక్రవారం గాజులమ్మ తల్లిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చీరసారెలను సమర్పించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

ఆలయానికి రూ.13 లక్షల ఆదాయం

దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయం వద్ద ఏడాది కాలానికి వస్తువిక్రయ హక్కుల కోసం శుక్రవారం అధికారులు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. పూలుపండ్లు విక్రయ హక్కును జనగాం జిల్లా పాలకుర్తికి చెందిన జెట్టి కుమార్ రూ. 13.06 లక్షలకు దక్కించుకున్నాడు. గతేడాదితో పోల్చితే సుమారు రూ.3 లక్షల మేర ఆదాయం పెరిగింది. అదేవిధంగా ఫొటోలు తీసేందుకు, కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర, గాజుల కిరాణం, మిఠాయిల విక్రయాలకు నిర్వహించిన టెండర్లలో సరైన వేలం రాకపోవడంతో వాయిదావేసినట్టు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి, ఈవో జయరామయ్య తెలిపారు.

అక్షరాభ్యాసంచేయిస్తూ.. పథకాల గురించి ఆరా తీస్తూ



కొండమల్లేపల్లి : పెండ్లిపాకల పంచాయతీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

పెద్దఅడిశర్లపల్లి, దేవరకొండ, కొండమల్లేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం శుక్రవారం పర్యటించింది. పెద్దఅడిశర్లపల్లి మండలంలో తహసీల్దార్ కార్యాలయంతో పాటు మేడారం గ్రామ పంచాయతీని సందర్శించారు. తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎస్ఐ నర్సింహులును కలిసి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరాతీశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

- కొండమల్లేపల్లి మండలం పెండ్లిపాకల గ్రామంలో గ్రామస్థులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల గురించి ఆరా తీశారు. వారి వెంట ఎంపీడీవో బాలరాజురెడ్డి, నర్సింహారావు, కార్యదర్శి ధన్ సింగ్ తదితరులున్నారు.
- దేవరకొండ మండలం ముదిగొండ అంగన్‌వాడీ కేంద్రాన్ని ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం సందర్శించింది. అంగన్‌వాడీలో పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టిక ఆహార వివరాలను తెలుసుకున్నారు. చిన్నారుల ఆట వస్తువులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు ఎలాంటి పౌష్టికాహారం తీసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. వారి వెంట ఎంపీడీవో డానియెల్, ఏసీడీపీవో అనురాధ, సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎంలు అంజలి, విజయ ఉన్నారు. స్థానికులు గిరిజన సంప్రదాయ అలంకరణ దుస్తులను వారికి వేశారు. అంగన్‌వాడీ కేంద్ర నిర్వహణ గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత అధికారుల బృందానికి వివరించారు. ఎంపీడీవో చంద్రమౌళి డానియేల్, బాలరాజురెడ్డి, ఏసీడీపీవో అనురాధ, ఐఏఎస్‌ల బృందం పాయల్ మీనా, రష్మి, అభిషేక్ రంజన్, కునాల్ గురురాని, అషుతోష్ సాటి ఉన్నారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



దేవరకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామ క్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు నల్లగొండ జిల్లా దేవరకొండ ఆర్టీసీ డిపో డీఎం తల్లాడ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో అమరావతి, రామలింగేశ్వర స్వామి, భీమవరం, సోమేశ్వరస్వామి, పాలకొల్లు, క్షీర లింగేశ్వరస్వామి, ద్రాక్షారామం, భీమేశ్వరస్వామి, సామర్లకోట భీమలింగేశ్వరస్వామి క్షేత్రాలకు ప్రతీ ఆదివారం రాత్రి 8 గంటలకు దేవరకొండ బస్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. నవంబరు 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా 14వ తేదీ రాత్రి 8 గంటలకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. నవంబరు 13న తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. పంచరామాలకు డీలక్స్ బస్ చార్జీలు పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు రూ.1200 టికెట్ ఉంటుందని పేర్కొన్నారు. పంచరామ క్షేత్రలకు వెళ్లే భక్తులు పూర్తి వివరాల కోసం దేవరకొండ ఆర్టీసీ డిపో కంట్రోల్ పాయింట్ వద్ద సంప్రదించాలన్నారు. బుకింగ్ వివరాల కోసం సెల్. 7382833031 నెంబర్‌లకు ఫోన్‌చేసి తెలుసుకోవాలన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు కేఆర్ఆర్ విద్యార్థి



కోదాడ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఆకుల నవీన్ ఎంపికయ్యారు. ఈ నెల 23వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎంజీయూలో జరిగిన పోటీల్లో నవీన్ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 30వ తేదీ నుంచి నవంబరు నాల్గో తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు కళాశాల తరుపున నవీన్ పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ చందా అప్పారావు తెలిపారు. అనంతరం నవీన్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఫ్రాన్సిస్, సహాయాచార్యులు సైదిరెడ్డి, జీ సైదులు, కబడ్డీ శిక్షణ నిపుణులు నామ నరసింహారావు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, అభినందనలు తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు మఠంపల్లి విద్యార్థులు



గౌతమ్, హర్షిత, మల్లేశ్వరి

మఠంపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలో పాఠశాల గ్రేమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14, అండర్-17 జిల్లాస్థాయి పోటీల్లో మఠంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు పీఈటీ వీరస్వామి శుక్రవారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థి ఏ గౌతమ్, 9వ తరగతి విద్యార్థి హర్షిత, 10వ తరగతి విద్యార్థిని మల్లేశ్వరిలు వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ తెలిపారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగే పోటీల్లో సూర్యాపేట జిల్లా తరుపున పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రవీందర్, పీఈటీలు వెంకటేశ్వర్లు, సీతారాంరెడ్డి, ఉపేందర్, సతీష్‌లు అభినందించారు.

జానకీరాంకు నేషనల్ ఫిజీషియన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న జానకీరాం

చిలుకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన డాక్టర్ జానకీరాం ఎమర్జెన్సీ ఫిజీషియన్ విభాగంలో నేషనల్ ఎమర్జెన్సీ ఫిజీషియన్ ఆఫ్‌ది ఇయర్-2024 అవార్డును అందు కున్నారు. ఢిల్లీలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జీతూలాల్ నుంచి ఈ అవార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాన్ని వ్యాపారంగా కాకుండా సేవా దృక్పదంతో పేదలందరికీ అందేలా చూడాలన్నారు. జానకిరాంను గ్రామస్థులు, బంధుమిత్రులు అభినందించారు.

కేతేపల్లి వాసి హరీష్‌కు డాక్టరేట్



హరీష్

కేతేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల భాషలో సృజనాత్మకత పెంపుదలపై చేసిన పరిశోధనలకు నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన దండు హరీష్ డాక్టరేట్ పట్టా పొందారు. ఎంజీయూలో ఆంగ్ల సాహిత్యంలో ఎంఏ పూర్తి చేసిన హరీష్ హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో ప్రొఫెసర్ ఎస్.నాగేశ్వరరావు వద్ద రీసెర్చ్‌స్కాలర్‌గా చేరారు. జేఆర్ఎఫ్ యూజీసీ ఫండింగ్‌తో ఐదేళ్ల డాక్టరేట్ కోర్సు పూర్తి చేశారు. వెర్బల్ క్రియేటివిటీ, మానవుడి ఆలోచన పరిజ్ఞానాన్ని ఏఐ ఎలా దెబ్బతీస్తుందనే అంశాలపై హరీష్ రాసిన ఆర్టికల్స్ యూజీసీ కేర్‌లిస్టు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ పట్టా పొందిన హరీష్‌ను తల్లిదండ్రులు, గ్రామస్థులు, స్నేహితులు అభినందించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


నజీర్ మృతదేహం

మాడ్గులపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కుక్కడం గ్రామానికి చెందిన మహమ్మద్ నజీర్(50) తనకున్న గేదెను మేపేందుకు కుక్కడం చెరువు వద్దకు వెళ్లాడు. గేదె మేసుకుంటూ చెరువులోకి వెళ్లడంతో దానిని బయటకు తీసుకువచ్చేందుకు నజీర్ చెరువులోకి దిగాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో చెరువులో మునిగిన నజీర్‌ను బయటకు తీశారు. మృతి చెందిన నజీర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పశువులను కాసేందుకు వెళ్లి చెరువులో మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ విషయంపై ఎస్ఐ కృష్ణయ్యను వివరణ అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

బైక్ పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం

మేళ్లచెర్వు, అక్టోబరు 25: ద్విచక్ర వాహనం పైనుంచి పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం కందిబండ గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మేళ్లచెర్వు మండల పరిధిలోని వేపలమాదారం గ్రామానికి చెందిన బత్తుల శ్రీను (48) శుక్రవారం ద్విచక్రవాహనంపై తన వ్యక్తిగత పనుల నిమిత్తం కోదాడకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి తన స్వగ్రామానికి బయలుదేరాడు. ఇటీవల వర్షాలకు కందిబండ గ్రామ సమీపంలో బ్రిడ్జి కూలింది. ఆ బ్రిడ్జిని చీకట్లో గుర్తించక దాని సమీపంలో ఏర్పాటు చేసిన డైవర్షన్ మట్టికుప్పల పైకి బైక్‌ను ఎక్కించడంతో కిందపడ్డిరు. దీంతో తలకు బలమైన గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు శ్రీనుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు లారీలు

- కేబిన్‌లో ఇరుక్కొని నరకయాతన పడిన డ్రైవర్


లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ కృష్ణ

వాజేడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొని లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం వరంగల్ జిల్లా వాజేడు మండల పరిధిలోని భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి వాజేడు మండలంలోని రాంపురం ఇసుక సొసైటీలో లోడింగ్ కోసం వస్తున్న లారీ, అదే సొసైటీ నుంచి ఇసుక లోడుతో వెళ్తున్న మరో లారీ మండలంలోని చీకుపల్లి వంతెన మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఓగోడు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ చిట్టిపాక కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అతడు లారీ కేబిన్‌లో ఇరుక్కొని సుమారు గంటన్నర పాటు నరకయాతన పడ్డాడు. రెండు కాళ్లు ఇంజిన్ భాగంలో ఇరుక్కుపోవడంతో బయటకు రాలేకపోయాడు. ఒక కాలు రెండు చోట్ల పూర్తిగా విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. మరో లారీ డ్రైవరు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాద సమాచారం అందుకున్న వాజేడు ఎస్ఐ హరీష్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని స్థానికుల సాయంతో డ్రైవర్ కృష్ణను బయటకు తీశారు. 108ద్వారా ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ప్రమాదంలో ఒక లారీ నుజ్జునుజ్జువగా మరొకటి పాక్షికంగా దెబ్బతిన్నది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


పొనుగోడు రిజర్వాయర్‌లో గుర్తు తెలియని మృతదేహం

గరిడేపల్లి, అక్టోబరు 25: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని పొనుగోడు రిజర్వాయర్‌లో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... మృతుడికి 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, మృతుడి కుడి చేతికి, కుడి కాలికి రాగి కడియం ఉందని, కుడి చేతికి రాగి ఉంగరం ఉందని తెలిపారు. వివరాలు తెలిసిన వారు ఎస్ఐ ఫోన్‌నెంబర్ 8712686053ను సంప్రదించాలని కోరారు.

తల్లిని కొడుకుల వద్దకు చేర్చిన అధికారులు

దామరచర్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కన్న తల్లి బాగోగులు చూసుకోకుండా కొడుకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని రెండు రోజుల క్రితం సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో పాటు దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి ఎందిన వృద్ధురాలు తౌడోజు లక్ష్మమ్మ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం అధికారులు చర్యలు చేపట్టారు. లక్ష్మమ్మ కుమారులైన నరసింహాచారి, వినోదచారిలను పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించారు. తల్లి బాగోగులను పట్టించుకోకపోతే తగుచర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి హెచ్చరించారు. కౌన్సిలింగ్ అనంతరం ఆమె కుమారుల్లో పరివర్తన రావడంతో తల్లిని వంతుల వారీగా ఇంటికి తీసుకెళ్లి సేవలు చేయడంతో పాటు ఆర్థిక ఖర్చులు సైతం భరిస్తామని హామీ పత్రం రాసి ఇవ్వడంతో వృద్ధురాలైన లక్ష్మమ్మను అధికారులు ఆమె కుమారులకు అప్పగించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి, అధికారులు వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెను విక్రయించారనే
మనస్తాపంతో బలవన్మరణం

- ఆలస్యంగా వెలుగులోకి....
- నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో ఘటన

మర్రిగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కుమార్తెను తనకు తెలియకుండా విక్రయించారనే మనస్తాపంతో ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం గట్లమల్లేపల్లి గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... గట్లమల్లేపల్లి గ్రామానికి చెందిన మల్లిరెడ్డి సైదిరెడ్డి(36)కి కుమురం భీం జిల్లా బాటుపల్లికి చెందిన దీపికతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి మూడేళ్ల క్రితం కుమార్తె వర్షిక జన్మించింది. అనంతరం దీపిక అనారోగ్యానికి గురై మానసిక సమస్యలతో బాధపడుతోంది. దీంతో వర్షిక బాగోగులు సైదిరెడ్డి తల్లి రమణమ్మతో పాటు అక్క సంధ్య చూసుకుంటున్నారు. తన కుమార్తె కనిపించకపోవడంతో తల్లి రమణమ్మ, అక్క సంధ్యను ప్రశ్నించగా వారు ఎలాంటి సమాధానం చెప్పకుండా దాటవేశారు. సైదిరెడ్డికి తెలియకుండా తల్లి, అక్క కలిసి కుమార్తెను గుంటూరు జిల్లాకు చెందిన వారికి విక్రయించినట్లు సమాచారం. దీంతో అసహనానికి గురైన సైదిరెడ్డి కుమార్తె కనిపించడం లేదనే మనస్తాపంతో ఈ నెల 22వ తేదీన పురుగుల మందు తాగటంతో 23వ తేదీన మృతిచెందాడు. చిన్నారిని తీసుకువస్తేనే అంత్యక్రియలు నిర్వహించాలని గ్రామస్థులు, బంధువులు డిమాండ్ చేయటంతో బుధవారం గుంటూరు నుంచి చిన్నారిని తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న నాంపల్లి ఎస్ఐ శోభన్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మితో కలిసి గురువారం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. వర్షిక నానమ్మ రమణమ్మ వద్దనే సురక్షితంగా ఉందని, అనంతరం పాపను తల్లికి అప్పగించారు. అనంతరం గ్రామంలో సైదిరెడ్డికి అంత్యక్రియలు నిర్వహించారు. శిశువిక్రయం జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు, నాంపల్లి పోలీస్ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది శుక్రవారం గ్రామానికి చేరుకుని వర్షికను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం నల్లగొండ జిల్లా కేంద్రంలోని శిశుగృహకు తరలించినట్లు ఎస్ఐ శోభన్‌బాబు, సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. వర్షికను విక్రయించారా? లేదా? అనే విషయంపై జిల్లా అధికారులు విచారణ చేయనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఎస్ఐ తెలిపారు. సైదిరెడ్డి ఆత్మహత్యా ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

మూగజీవాల అక్రమ రవాణా గుట్టురట్టు

- ఇతర రాష్ట్రాలకు పశువుల తరలింపు
- ఎంతో కాలంగా కొనసాగుతున్న దందా
- పట్టించుకోని అధికారులు

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పశువుల వ్యాపారం పేరుతో కొందరు మూగ జీవాలను తండాలు, గ్రామాల్లో ఒక చోట డంప్ చేసి భారీ లారీల్లో కేరళ, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో గల కబేళాలకు తరలిస్తున్నారు. అక్రమార్కులు చేస్తున్న దందా గురించి ఈ నెల 4వ తేదీన 'మూగరోదన' అనే కథనాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలోనే గురువారం రాత్రి మండలంలోని రంగుండ్ల తండా నుంచి కర్ణాటకు చెందిన భారీ కంటైనర్ లారీలో 35 మూగజీవాలను వాటి కొమ్ములను తాళ్లతో బిగించి కర్కశంగా లారీల్లో కుక్కించి ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తుండగా నాగార్జునసాగర్ పోలీసులు పట్టుకున్నారు. దీంతో మూగజీవాల అక్రమ రవాణా గుట్టురట్టయింది. ఈ క్రమంలో లారీని, మూగజీవాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. అంతేకాక మూగజీవాలను చండూరు మండలంలోని బంగారుగడ్డలో గల గోశాలకు తరలించినట్లు తెలిసింది.

గుట్టుచప్పుడు కాకుండా....

ప్రధానంగా మండలంలోని రంగుండ్ల, గర్కనెట్‌తండాల్లో గుట్టుచప్పుడు కాకుండా కొందరు ఈ అక్రమ దందాను చేస్తున్నారని సమాచారం. అయితే ఈ దందా ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్నా స్థానిక పోలీసులు సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నాయకులు, అధికారుల అండదండలతోనే అక్రమార్కులు ఈ దందాను చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. చాలాకాలంగా వారానికి రెండు సార్లు ఈ మూగజీవాలను లారీల్లో అక్రమంగా తరలిస్తున్నా పోలీసులు, నిఘా విభాగం కళ్లు కప్పి అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు దాటి లారీలు ఎలా వెళ్తున్నాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆంధ్రా, తమిళనాడు, కేరళ వంటి అంతరాష్ట్రాలకు, హైదరాబాద్‌కు ఈ అక్రమ రవాణా కొనసాగుతుందంటే నాయకుల, అధికారుల అండదండలు, భారీగా ముడుపులు చేతులు మారుతండటం వల్లే కొనసాగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్కో లారీలో తరలించే మూగజీవాల విలువ సుమారు రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు ఉంటుందని తెలిసింది.

పల్లె ప్రకృతివనంలో దాచిందెవరు...


కంటైనర్ క్రూరంగా కట్టి కంటైనర్‌లో తరలిస్తున్న మూగజీవాలు

మండలంలోని గర్కనెట్ తండాలో పల్లె ప్రకృతివనంలో కొందరు పశువులను కట్టేస్తున్నారని సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. దీంతో వారు వారు వెళ్లి చూడగా నిర్మానుష్య ప్రాంతంలో పల్లెప్రకృతి వనంలో సుమారు 40మూగజీవాలు నిర్బంధించి ఉన్నట్లు గుర్తించారు. అయితే ప్రభుత్వ పల్లెప్రకృతి వనంలో కొందరు చాలాకాలంగా ఇలా మూగజీవాలను నిర్బంధించి వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారం ఉన్నా పోలీసు లు, సంబంధిత శాఖ అధికారులు సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

చోరీకి గురైన పశువులు ఏమయ్యాయి?

మండలంలోని నెల్లికల్‌కు చెందిన గుండెబోయిన శ్రీను అనే రైతుకు చెందిన తన ఎద్దులను సొంత కొట్టంలో కట్టేసి ఉంచగా కొందరు మాటు వేసి గత నెల 26వ తేదీన రాత్రికి రాత్రి దొంగలించి ప్యాసింజర్ ఆటోలో దొంగలించుకెళ్లారు. దీంతో సదరు రైతు తన గ్రామంలో గల సీసీ కెమెరాలను పరిశీలించి కొంపెల్లి మీదుగా రాజవరం వెళ్లాయని గుర్తించి ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నెల రోజులవుతున్నా ఎద్దుల జాడ నేటికీ లభ్యం కాలేదు. అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న ముఠాకు చెందిన వారే మూగజీవాలను లారీల్లో తరలించినట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే మండలంలోని పలు గ్రామాల్లో మేతకు వెళ్లిన, పొలంలో, పశువుల కొట్టాల్లో కట్టేసిన మూగ జీవాలను ఈ విధంగా దొంగలించిన సంఘటనలు పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైన దాఖలాలు ఉన్నాయి. అయినా పోలీసులు సంబంధిత ముఠాలు దొంగతనం చేసే వారిపై కఠినంగా చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇవి పునరావృతం అవుతున్నాయని రైతులు విమర్శిస్తున్నారు.

పశువుల కంటైనర్ పట్టివేత

- ఐదుగురిపై కేసు నమోదు


సాగర్‌లో పోలీసులు పట్టుకున్న కంటైనర్

నాగార్జునసాగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కబేళాకు తరలిస్తున్న పశువుల కంటెయినర్‌ను గురువారం అర్ధరాత్రి సాగర్ పోలీసులు పట్టుకున్నారు. సాగర్ సీఐ బీసన్న తెలిపిన వివరాల ప్రకారం... తిరుమలగిరి(సాగర్) మండల రంగుండ్ల గ్రామం నుంచి 10 దున్నపోతులు, 2 గేదెలు, 23 ఎద్దులను కంటైనర్‌లో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా తమిళనాడుకు తరలిస్తుండగా హిల్‌కాలనీ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. అర్ధరాత్రి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి ఒక భారీ కంటైనర్ ఆపారు. దానిని తెరచి చూడగా అందులో మొత్తం 35 పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. పట్టుకున్న పశువుల విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ఘటనలో వాహన డ్రైవర్ షబ్బీర్‌తో పాటు ఖాసీం, రంజిత్‌నాయక్, రాఘవేంద్ర నాయక్, స్వామిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుకున్న పశువులను చండూరు వద్ద బంగారు గడ్డ గోశాలకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

బాలసదన్ నుంచి బడికి...

- కుమార్తె కోసం రాని తల్లిదండ్రులు
- విద్యార్థినికి అండగా బాలల సంరక్షణ అధికారులు

చౌటుప్పల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'నాన్న కొడుతున్నాడు... ఇంటికి వెళితే అమ్మేస్తాడేమోనన్న' భయంతో పాఠశాలలోనే దాక్కున్న విద్యార్థినిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్వాహకులు బాలసదన్ నుంచి మరొక పాఠశాలలో చేర్పించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని బాబానగర్‌కు చెందిన అక్బర్ దంపతులు తమ కుమార్తె(11)ను గత విద్యాసంవత్సరంలో యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. సమీపంలో ఉన్న గ్రేట్ కమిషన్ చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో(వసతిగృహం) ఉంటూ కుమార్తె చదువుకుంటోంది. కొద్దిరోజుల తర్వాత తల్లిదండ్రులిద్దరూ తమ పాపను తీసుకెళతామని చెప్పడంతో సంబంధిత అధికారులు ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు. కొన్ని నెలల క్రితం అక్బర్ దంపతులు చౌటుప్పల్‌కు వచ్చి ఇక్కడే నివాసం ఉన్నారు. వారి కుమార్తెను చౌటుప్పల్‌లోని బంగారిగడ్డ ప్రాథమిక పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించారు. కొద్దిరోజుల క్రితం దంపతులు ఘర్షణ పడ్డారు. దీంతో తల్లి తన కుమారుడిని తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అప్పటినుంచి అక్బర్ తన భార్యపై కోపాన్ని కుమార్తెపై చూపుతున్నాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో పాఠశాలకు వచ్చిన విద్యార్థిని తనను తండ్రి కొట్టి వేధిస్తున్న విషయం తోటి స్నేహితుల వద్ద చెప్పింది. ఈ విషయాన్ని విద్యార్థులు ఉపాధ్యాయురాలికి సమాచారం ఇచ్చారు. అదే సమయంలో పాఠశాలకు వచ్చిన తండ్రిని చూసిన విద్యార్థిని అక్కడి నుంచి పరిగెత్తి సమీపంలో ఉన్న భవిత కేంద్రంలో దాక్కొంది. పాఠశాలకు వచ్చిన తండ్రికి తన కుమార్తె కనిపించకపోవడంతో ఉపాధ్యాయులతో గొడవ పడ్డాడు. దీంతో ఉపాధ్యాయులు ఆ విద్యార్థినిని ఎంఈవో కార్యాలయానికి తీసుకువచ్చి జరిగినదంతా చెప్పారు. దీంతో ఎంఈవో గురవారావు పోలీసులకు సమాచారమిచ్చి ఆ విద్యార్థినిని చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగిన తండ్రిని అక్కడినుంచి పంపించివేశారు. సామాజిక కార్యకర్తల సంరక్షణలో ఆ విద్యార్థినిని జిల్లా కేంద్రం భువనగిరిలోని బాలసదన్‌కు తరలించారు. కాగా, శుక్రవారం ఆ విద్యార్థిని కోసం తల్లిదండ్రులు ఎవరూ బాలసదన్‌కు వెళ్లలేదు. దీంతో ఆ విద్యార్థినిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు గతంలో ఆ విద్యార్థి విద్యాభ్యాసం చేసిన బొమ్మలరామారంలోని ప్రభుత్వ పాఠశాలలో, వసతి కోసం గ్రేట్ కమిషన్ చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూట్‌లో చేర్పించారు. బాలిక విద్యాభ్యాసం, సంరక్షణకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నట్లు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు తెలిపారు.

తాయెత్తులు ఇచ్చి రూ.40వేలు స్వాహా

ఆత్మకూరు(ఎం) అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మీ ఇంటికి వాస్తు దోషం ఉంది. కుమారుడికి ప్రాణ గండం ఉంది. అమావాస్య వరకు పూజ చేయించుకోవాలి, లేదంటే తీవ్రంగా నష్టపోతారని ఓ రైతును ఓ బాబా నమ్మించి రూ.40వేలు కాజేసి పరారయ్యాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని సింగారం గ్రామానికి చెందిన రైతు వాకిటి మల్లారెడ్డి, మణెమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. శుక్రవారం బాబా వేషధారణలో ఉన్న ఓ వ్యక్తి మల్లారెడ్డి ఇంటికి వచ్చి అమ్మా మీ ఇంటికి దోషం ఉంది. కుమారుడికి గండం ఉంది. దోషం పోవడానికి పూజ చేస్తానని, అందుకు రూ.20 వేలు అవుతుందని బాబా చెప్పాడు. అంత డబ్బు లేదని అన్నారు. ఎంత ఉంటే అంత ఇవ్వండి అని లేకుంటే ప్రమాదం జరుగుతుందని వారిని భయభ్రాంతులకు గురిచేశాడు. రూ.3 వేలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. దీంతో బాబా ఇంట్లో పూజ చేసి మూడు తాయత్తులు తీసి మల్లారెడ్డికి ఇచ్చాడు. రూ.10 వేలు ఇవ్వాలని బాబా ఒత్తిడి చేయగా, తొందరపాటులో ఇంట్లో దాచిన రూ.38,900లను బాబాకు ఇచ్చాడు. ఆ డబ్బు తీసుకుని బైక్‌పై వెళ్లిపోయాడు. మోసపోయానని తెలుసుకుని రైతు బాబా కోసం గాలించినా దొరకలేదు. దీంతో బాధిత రైతు ఆత్మకూరు(ఎం) పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాబా కోసం వెతుకున్నట్లు సీఐ సోలోమన్ రాజు తెలిపారు.

అంతర్‌రాష్ట్ర దొంగల అరెస్టు

సూర్యాపేటక్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సూర్యాపేట పట్టణ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ సీఐ రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. సూర్యాపేట పట్టణ పోలీసులు శుక్రవారం కొత్తబస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న వ్యవహరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా గొడుగుపేట గ్రామానికి చెందిన విన్నకోట సాయికుమార్‌గా తన వివరాలు తెలిపాడు. పలు నేరాలకు పాల్పడంతో పాటు ద్విచక్రవాహనాలు దొంగతనం చేసేవాడు. ఈ క్రమంలో ఆగస్టు నెల 8వ తేదీన ఏదైనా ద్విచక్రవాహనం చోరీ చేయాలని నిర్ణయించుకొని హన్మకొండ నుంచి జనగాం వరకు ద్విచక్ర వాహనంలో వెళ్లేందుకు ఓ యాప్‌లో బుక్ చేసుకున్నాడు. జనగాం వరకు వచ్చే క్రమంలో ఎక్కడా ద్విచక్రవాహనం చోరీ చేయడానికి వీలు కాకపోవడంతో సూర్యాపేట వరకు దింపాలని, అదనంగా మరో రూ.1000 ఇస్తానని చెప్పి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వరకు వచ్చాడు. తాను వచ్చిన ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తిని మెడిసిన్ తీసుకురమ్మని చెప్పి పంపి, ఆ వాహనంతో అక్కడినుంచి పారిపోయాడు. దొంగిలించిన ద్విచక్రవాహనంపై హైదరాబాద్, బెంగుళూరు, ఇబ్రహీంపట్నం, యాదగిరిగుట్ట ప్రాంతాల్లో తిరుగుతూ మోసాలకు పాల్పడ్డాడు. ఇదే క్రమంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో వాహన తనిఖీల్లో పట్టుబడిన సాయికుమార్‌ను అరెస్టు చేశారు. పట్టుబడిన సాయికుమార్ వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా అందులో 15తులాల నకిలీ బంగారంతో పాటు ఆభరణాలు దొరికాయి. ఇటీవల యాదగిరిగుట్టలో నకిలీ బంగారం విక్రయించే క్రమంలో తక్కువకు ఇస్తానని ముందుగా కొంత నగదు ఇవ్వాలని సుమారు 20వేల వరకు నగదును మోసగించి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ గోపీకృష్ణ, కుశలవ, హెడ్‌కానిస్టేబుళ్లు కరుణాకర్, కృష్ణ, సైదులు, కానిస్టేబుల్ మధు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో మరొకరు ..

చౌటుప్పల్‌రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలలో పలు దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని శుక్రవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో అరెస్టు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... కొత్తగూడెం జిల్లా ఎస్ మండలం జూలూరుపాడు గ్రామానికి చెందిన కారేమ్ నరేష్ (35)ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు స్టేషన్లలో మొత్తం 11 కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడు చౌటుప్పల్ బస్టాండ్‌లో దొంగతనాల కోసం అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుడి వేలిముద్రలు పరిశీలించి విచారణ చేశారు. చోరీలకు వచ్చినట్లు పోలీసుల ముందు ఒప్పుకున్న నరేష్‌ను అరెస్టు చేసి కోర్టులో రిమాండ్‌కు పంపించినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

రేషన్‌బియ్యం తరలిస్తున్న వాహనం బోల్తా

- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు
- 40 నిమిషాల్లో క్షతగాత్రులు, వాహనం తరలింపు


నాగుర్‌వలీ మృతదేహం

దామరచర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనం బోల్తా పడి ఒకరు మృతిచెందగా ఇద్దరు గాయపడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై శుక్రవారం ఈ సంఘటన జరిగింది. బోల్తా పడిన వాహనంలోని రేషన్ బియ్యాన్ని అక్కడే వదిలేసి వాహనంతో పాటు క్షతగాత్రులను అక్కడి నుంచి తరలించారు. స్థానికులు, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మిర్యాలగూడ వైపు నుంచి గుంటూరు వైపునకు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో ఓ ఆటో వేగంగా వెళుతోంది. బియ్యం లోడుపై ముగ్గురు కూర్చుని ఉండగా, క్యాబిన్‌లో డ్రైవర్ సహా ఇద్దరు ఉన్నారు. దామరచర్ల మండల కేంద్రం సమీపంలో వాహనం ముందు టైర్ పేలి వాహనం అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ఘటనలో బియ్యం లోడుపై కూర్చున్న ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రేషన్ బియ్యంతో వెళుతున్న వాహనాన్ని వెనుకనుంచి మరో వాహనంలో అనుసరిస్తున్న కొందరు వ్యక్తులు సంఘటనా స్థలానికి చేరుకుని బోల్తా పడిన వాహనంలోని బస్తాలను తొలగించి వాహనాన్ని పైకి లేపారు. క్షతగాత్రులను తమ కారులో ఎక్కించుకుని గుంటూరు వైపు వెళ్లారు. బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని అక్కడినుంచి తీసుకువెళ్లారు. వాహనాన్ని కొద్దిదూరం తీసుకెళ్లి టైర్ మార్చి తీసుకెళ్లి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ తతంగం మొత్తం 40నిమిషాల్లో జరిగిపోయింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో రక్తపు మరకలు ఉండటంతో, స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వేరే వాహనంలో స్టేషన్‌కు తరలించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ చేపట్టారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందినట్లు అక్కడి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే దాచేపల్లి గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టగా అదే గ్రామానికి చెందిన కూలీ, షేక్ నాగుర్ వలీ (35) మృతి చెందినట్లు గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో తీవ్రంగా గాయపడిన నాగుర్‌వలీని కారులో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందడంతో మృతదేహాన్ని అప్పగించి వెళ్లారని కుటుంబ సభ్యులు తెలిపారు. నాగుర్‌వలీకి భార్య హుస్సేన్‌బీ, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ శేఖర్ తెలిపారు.

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ


కోమటిరెడ్డి సబితకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈవో

భువనగిరి అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్థిని శ్రీ రామలింగేశ్వరస్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.9,55,518 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారిని దర్శించుకున్న మంత్రి కోమటిరెడ్డి సతీమణి సబిత

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సతీమణి సబిత శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు. అదేవిధంగా సంగీత సభల్లో భాగంగా సాయంత్రం శ్రావణి సంగీత సంస్థతో భక్తి సంగీతం, శ్రీనృత్యాలయ కూచిపూడి అకాడమీ కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించాయి.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.154	230	260
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.135	198	230

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	589.30
టీఎంసీలు	309.9534
ఎడమకాల్వకు నీటి విడుదల	6,173
కుడికాల్వకు	10,120
విద్యుత్ కేంద్రం ద్వారా	29,719
క్రస్ట్ గేట్ల ద్వారా	96,324
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	1,22,788 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	1,45,136 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	12

- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.67 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	1,44,550
అవుట్‌ఫ్లో	1,35420 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	5

- మేళ్లచెర్వు, (ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.13
ప్రస్తుత నీటి మట్టం	643.73 అడుగులు
టీఎంసీలు	4.13
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	1088.88 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	700.03 క్యూసెక్కులు

- కేతేపల్లి (ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	20 అడుగులు

- శాలిగౌరారం (ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3750 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3750 క్యూసెక్కులు

- డిండి (ఆంధ్రజ్యోతి)

బెల్టుషాపు
నిర్వాహకురాలిపై కేసు

చౌటుప్పల్‌రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం జేకేసారంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న పందుల సుగుణమ్మపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రూ.10వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మాడ్గులపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో 16 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం... మండలకేంద్రంలో పీడీఎస్ బియ్యాన్ని దళారులు కొనుగోలు చేసి నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు గురువారం రాత్రి పట్టుకున్నారు. దామరచర్ల మండలం కేజేఆర్ కాలనీకి చెందిన వద్యా బాలమ్మ మాడ్గులపల్లి మండల కేంద్రంలో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి గ్రామంలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు సుమారు 16 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వద్యా బాలమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

పండుగకూ పస్తులే..

▸▸ చండూరు మున్సిపాలిటీలో 5 నెలలుగా అందని వేతనాలు ▸▸ ఇబ్బందులు పడుతున్న కార్మికులు

చండూరు మున్సిపాలిటీలో కార్మికుల కుటుంబాలు, సిబ్బంది అర్ధాకలితో అలమటిస్తున్నారు. కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఫలితంగా తీవ్ర అవస్థలు పడుతున్నారు. దాంతో పూట గడుపుకునేందుకు ప్రైవేటు ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. అధికారులు ఐదు నెలలకోసారి వేతనాలు ఒక నెల జీతం అందిస్తే అప్పులు చేసిన వడ్డీలకే సరిపోవడం లేదని వాపోతున్నారు.

- (చండూరు- ఆంధ్రజ్యోతి)



చండూరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 49మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారు. ఇందులో 25మంది పారిశుధ్య కార్మికులు, 9 మంది వాటర్‌మన్లు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ముగ్గు రు ఎలక్ట్రిషియన్లు,ఐదుగురు బిల్‌కలెక్టర్లు,ఇద్దరు అటెండర్లు, ఇంకా ఇతర సిబ్బంది ఉన్నారు. వీరికి నెలకు సుమారు రూ. 9.66 లక్షల వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలు, ఇతర సిబ్బందికి ఐదునెలల జీతాలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు కా ర్మికులకు రూ.54లక్షలు వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంది.

పన్నులు వసూలు లేకపోవడంతోనే

చండూరు మున్సిపాలిటీలో పన్నులు వసూలు కాకపోవడం, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో మున్సిపల్ కార్యాలయంలో ఖాతాలో నగదు జీరోగా ఉంది. వ్యవసాయ పంటలకు పెట్టుబడి సీజన్ కావడంతో పన్నులు చెల్లించలేకపోతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్ నిధులు రాకపోవడంతో కార్యాలయానికి ఇతర ఆదాయం లేకుండా పోయింది. దాంతోపాటు గతంలో చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండ డంతో కార్మికులకు వేతనాలు చెల్లించ లేకపోతున్నారు.

ఇంకా పాత ట్యాక్స్ విధానమే

చండూరు గ్రామపంచాయతీ నుంచి మున్సి పాలిటీ ఏర్పాటైన నేటి వరకు పాత ట్యాక్స్ విధానాన్నే అధికారులు వసూలు చేస్తున్నారు. దాంతో మున్సిపాలిటీ ఆదాయం తగ్గిందని అధికారులు చెబుతున్నారు. ఇటీవల అధికారులు పన్ను రివిజన్ అనుమతికి కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. కలెక్టర్ అనుమతి రాగానే పన్నులు పెరిగే అవకాశం ఉంది. ప్రతి నెల రూ.3లక్షలు పన్నులు వసూలు కావాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.1.20 లక్షల వరకు వసూలు అవుతున్నాయి. ప్రతినెల జీతాలు అందకపోవడంతో పూట గడిపేందుకు చేతిలో చిల్లగవ్వ లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పెండింగ్‌లో ఉన్న వేత నాలతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని కోరుతున్నారు.

వచ్చే ఆదాయమే లేదు : మున్వర్ అలీ, కమిషనర్

చండూరు మున్సిపాలిటీలో ఆదాయ మార్గాలు లేకపోవడంతో కార్మికులకు సకాలంలో జీతాలు అందించ లేకపోతున్నాం. 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా రావడం లేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఒక నెల జీతం చెల్లించేలా అనుమతించారు. చెక్కులను కార్మికుల ఖాతాలో వేశాం. ఈవారం చివరిలో కార్మికుల వేతనాలు జమ అవుతాయి.

ప్రతి నెల జీతం అందించాలి



అధికారులు ప్రతి నెలజీతాలు ఇవ్వకపోవడంతో అప్పుల పాలయ్యాం. ఐదారు నెలలకు ఓసారి వేతనాలు ఇవ్వడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు సరిపో వడం లేదు. పని చేసి అప్పులు చేయాల్సిన పరి స్థి తి ఉంది. ప్రతి నెల జీతాలు అందేలా చేడాలని కోరు తున్నాం. - బీసంగి నాగరాజు, కార్మికుడు

సమాచారం

డ్రాయింగ్ కిట్ల పంపిణీ

నాగార్జునసాగర్,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీ, పైలాన్ కాలనీల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ తరగతులకు డ్రాయింగ్ కిట్లను నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో అందజేశారు. 40 మంది విద్యార్థులకు డ్రాయింగ్ కిట్లను అందజేసినట్లు ట్రస్టు ప్రతినిధులు జీఎల్ఎన్ రావు, తెలిపారు. ఉపాధ్యాయులు వాసు, మధుసూద న్, గగనేశ్వరీ, యాదగిరి, వెంకన్న, నరసింహరావు, ప్రసాద్, ఉన్నారు.

పాఠశాలకు చేయూత



వెంకటరమణచౌదరికి సన్మానం

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాస్‌నగర్ గురుకుల పాఠశాలకు మాజీ సర్పంచ్ భోగవెల్లి వెంకటరమణచౌదరి భోగవెల్లి సునీత మెమోరియల్ ఫౌండేషన్ ద్వారా చేయూత నందించారు. శుక్రవారం పాఠశాలకు రూ.2లక్షల విలువైన టేబుల్స్, చైర్స్, రాక్స్‌తోపాటు రూ. లక్ష విలువైన స్టడీ మెటీరియల్స్‌ను, పుస్తకాలను అందచేశారు. ఈ సందర్భంగా ఎంఈవో బాలునాయక్, ఆర్‌సీవో, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు భోగవెల్లి వెంకటరమణ చౌదరిని శాలువాతో సన్మానించారు.

బీమా చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకులకొండారం గ్రామానికి చెందిన నర్సింహ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ తర పున మంజూరైన రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి శుక్రవారం ఆయన భార్య చంద్రకళకు అందజేశారు. కంచర్ల మాట్లాడుతూ కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు.

పరిశుభ్రంగా ఉంచాలి

శాలిగౌరారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ చెట్లను బాగా పెంచి పర్యావరణాన్ని కాపాడాలని శాలిగౌరారం మండల ప్రత్యేకాధికారి చరితారెడ్డి కోరారు. మండలంలోని రామగిరి గ్రామాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. గ్రామపంచాయతీకి సంబంధించిన అవెన్యూ ప్లాంటేషన్, అంగన్‌వాడీ కేంద్రం, వైకుంఠ. దామం, కంపోస్టు షెడ్, నర్సరీని, పల్లె ప్రకృతి వనం పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంపీవో అల్లూరి పద్మ, ఏపీవో జంగమ్మ, ఈసీ వెంకటాచారి పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు మానుకోవాలి'

వేములపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా తనను ఎదుర్కోలేకనే కొందరు నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాలి కాంతారెడ్డి అన్నారు. మండలంలోని రావువారి గూడెంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను కొనుగోలు చేసిన పొలం పక్కనే ఉన్న పాఠశాల స్థలాన్ని ఆక్రమించానని కొందరు తనపై లేనిపోని అసత్య ఆరోపణ చేస్తున్నారని అన్నారు. తన భూమిలో పాఠశాలకు సంబంధించిన భూమి ఉన్నట్లు తేలితే నిరభ్యంతరంగా ఇచ్చేస్తానన్నారు. విష యంలో ఎవరికి ఏ సందేహం ఉన్నా వచ్చి సర్వే చేసుకోవచ్చని పేర్కొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిపై గాదరి వ్యాఖ్యలు సరికావు



తిప్పర్తి : సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి

తిప్పర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని తిప్పర్తి మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. మంత్రిని అసభ్య పదజాలంతో మాట్లాడడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి తీరు మార్చుకోకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు మీ భరతం పట్టడం ఖాయమని హెచ్చరించారు. సమావేశంలో నల్లగొండ మార్కెట్ కమిటి చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, ముత్తినేని శ్యాం సుందర్, బద్ధం సుధీర్, పాశం నరేష్ రెడ్డి, నాగులవంచ లింగారావు, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, ఊట్కూరి సందీప్‌రెడ్డి, జాకటి మోష, నలపరాజు శ్రీనివాస్, రొట్టెల రమేష్ ఉన్నారు.

'కిశోర్ వైఖరి సరికాదు'

నార్కట్‌పల్లి, అక్టోబరు25, (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ వైఖరి సరికాదని కాంగ్రెస్ నార్కట్‌పల్లి మండలాధ్యక్షుడు బత్తుల ఊశయ్య అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దృష్టిలో పడాలనే తపనతో మంత్రి కోమటిరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంపై నోరు జారితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో వడ్డే భూపాల్‌రెడ్డి, సట్టు సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, జెరిపోతుల భరత్, రాధారపు భిక్షపతి పాల్గొన్నారు.

● నల్లగొండ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికావని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ బోడ స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల తుంగతుర్తి ఎమ్మెల్యేగా ఆ ప్రాంత ప్రజలను మాయ మాటలతో మోసం చేశాడని ఆరోపించారు. అతడి మోసాలను గుర్తించిన ప్రజలు అక్కడి నుంచి తరిమికొట్టారన్నారు. సమావేశంలో పెరిక అంజ నేయులు, ఉపాధ్యక్షుడు బోళ్ల ప్రభాకర్, పెరిక హరిప్రసాద్, బోగరి రామకృష్ణ, మేడి శ్రీను, చిరుమర్తి శ్రీను పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి : ఎమ్మెల్సీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

హాలియా, అక్టోబర్ 25,(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు మంజూరై రూ. 6,48,500 విలువైన శుక్రవారం హా లియాలో అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ర వెంక టరెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ ఎక్కలూరి శ్రీనివాస్, కేశబోయిన జానయ్యగౌడ్, వడ్డే సతీష్‌రెడ్డి, దొరేపల్లి వెంకటేశ్వర్లు, బందిలి పెద్దసైదులు, రావులపాటి ఎల్లయ్య, అబుల్ అలీం, అంజాద్‌ఖాన్, జలీల్‌పాషా, షేక్ జానీ, హుస్సేన్, మక్బుల్, సత్యనారాయణ, ఆవుల సైదులు, కొట్టాల శ్రీను, బండి రమేష్, మార్క్, ఉదయ్, నర్సింహ పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మాడ్గులపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలేరువాగుపై నిర్మించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిలాఫలకంపై అప్పటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీ పోకల శ్రీవిద్యారాజు పేర్లు ఉండడంతో ఓర్వ లేని ధ్వంసం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పోకల రాజు మారుతి వెంకట్‌రెడ్డి, గడ్డమీది సైదులు, వెంకటాచారి, కొండు, జగన్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుల బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు

మర్రిగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపులు బంద్ చేస్తే బీజేపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ పార్టీ నాంపల్లి మండలాధ్యక్షుడు దాచేపల్లి నర్సింహ అన్నారు. నాంపల్లి మండలకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని తండాల్లో విచ్చలవిడిగా విక్రయం జరుగు తుం దని వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈవిషయంపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో చిరుమామిళ్ల గిరి బాబు, బీజేవైఎం మండలాధ్యక్షుడు నాంపల్లి సతీష్, పొలగోని శ్రీకాంత్, మేకల శ్రీకాంత్, పంగ లింగస్వామి పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించొద్దు'

మర్రిగూడ, వేములపల్లి, కట్టంగూరు, అక్టోబరు 25 : (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంతో నాణ్యత లోపించవద్దని మర్రిగూడ,వేములపల్లి, కట్టంగూరుమండల ప్రత్యేకాధికారులు వేణుగోపాల్, శ్రీనివాస్‌రావు కోటేశ్వర్‌రావు సూచించారు. మర్రిగూడ, వేములపల్లి మండల కేంద్రాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాల, కట్టంగూరులో కస్తూర్బా పాఠశాలలను శుక్రవారం వారు వేర్వేరుగా తనిఖీ చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విధిగా అందించాలని అన్నారు. అలాగే మర్రిగూడలో అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రభుత్వ ఆస్పత్రితో పాటు వర్మికంపోస్టు, డంపింగ్ యార్డులను శుక్రవారం ప్రత్యేకాధికారి పరిశీలించారు. అంతకు ముందు గ్రామపంచాయతీ కార్యాలయాలకు వెళ్లి రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో మున్న య్య, ఎంపీవో రవికుమార్, ఏపీవో వివేక్ వీరితో పాటు అధికారులు ఉన్నారు. కట్టంగూరులో నిర్మించిన కంపోస్టు షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు, ఏఈలు నవీన్, జమీల్, ఏపీఎం సైదులు, ఏపీవో రాంమోహన్ ఉన్నారు.

సీనియర్ జర్నలిస్టు కిరణ్ పై దాడి

నల్లగొండ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణానికి చెందిన పసుపు లేటి కిరణ్‌కుమార్‌పై శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. శుక్రవారం ఉదయ ఎన్‌జీ కళాశాలలో వాకింగ్ ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్ మీద అతడిని వెంబడించారు. ఇంట్లోకి వెళ్లే సమయంలో చేతులు చూపించి బెదరించారు. కిరణ్ వాళ్లను మరోవీధిలో మరొకరితో కలిసి ఉండడం గుర్తించి ఎందుకు వెంబడిస్తున్నారని అడుగుతుండగానే ముగ్గురు దాడి చేశారు. నీ అంతు చూస్తామని దుర్భాషలాడుతూదాడికి పాల్పడ్డారు. క్రమంలో దాడిని అడ్డుకున్న స్థానికులను కూడా నెట్టివేశారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో గుమిగూడడంతో అక్కడినుంచి పరారయ్యారు. కాగా ఇటీవల తనకు బెదిరింపు ఫోన్లు వచ్చాయని, ఈ దాడి, బెదిరింపులపై విచారణ చేపట్టాలని కిరణ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన విచారణ చేసి నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని టూ టౌన్ ఎస్‌ఐ నాగరాజు వెల్లడించారు

ఆలయ నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి విరాళం



రాజిరెడ్డికి విరాళం అందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తిప్పర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాల గ్రామ శివాలయ నిర్మాణానికి రాష్ట్ర రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం రూ.లక్ష నగదు విరాళం అంద జేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాజిరెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో బంధువుల ఇంటివద్ద చికిత్స పొందుతున్నారు. అయితే మంత్రి విషయం తెలుసుకొని శుక్రవారం రాజిరెడ్డిని పరామర్శించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి సంబంధించిన నగదును మంత్రి రాజిరెడ్డి అందజేశారు. ఆలయ నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి రూ.2.5 లక్షలు విరాళం ఇచ్చారు.

ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు : భార్గవ్



పుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చని మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ మనుమరాలు నైరా పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, క్రీడాసామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపనబోయిన నాగమణి, కుప్పాల సుబ్బారావు, రేణుగుంట్ల వీరయ్య, ఎం.వెంకటేశ్వర్లు, పసుపులేటి శివ, మధూరిశ్రీను, నిరంజన్, బాబు, సుబ్బారావు,పద్మావతి పాల్గొన్నారు.

'కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి'

గుర్రంపోడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని డీఎస్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని పోచంపల్లి, పిట్టలగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేయింగ్ స్కేళ్లు, మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్లు, గన్నీబ్యాగ్‌లు, ప్యాడీక్లీనర్లు ప్రతి సెంటర్‌లో అందుబాటులో ఉంచాలని నిర్వాహకులను కోరారు. ఆయన వెంట ఎంపీవో మంజుల, ఎంపీవో సుమలత, ఎంఈవో నోముల యాదగిరి, పీఆర్‌ఏఈ శ్రీనివాస్‌రావు, ఇన్‌చార్జి డీటీసీఎస్ రావుల సైదులుగౌడ్, ఏపీవో గోపాల్‌రెడ్డి, ఏపీఎం యాదయ్య, ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారుఖ్, చిరుమర్తి శ్రీనయ్య, అధ్యాపకులు వేణుగోపాల్, వెంకన్న, అంజుం, శ్రీలత పాల్గొన్నారు.

'సీసీఐ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'

చింతపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులందర సీసీఐ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో శ్రీరాములు అన్నారు. మండలంలోని శివ సాయి కాటన్ మిల్లును శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ వ్యక్తులకు పత్తి విక్రయి ంచడంపై రైతులను ఆయన ప్రశ్నించారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, దీంతో ప్రైవేట్ వ్యక్తులు కొనుగోలు చేస్తున్నట్లు వారు తెలిపారు. తహసీల్దార్ రమాకాంత్ శర్మ, ఆర్ఐ సునీత పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం మిర్యాలగూడలో నిరసన ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ సంపత్ మాట్లాడుతూ స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్న విద్యాశాఖకు అరకొర నిధులు కేటాయించడం, పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బొల్లేపల్లి మధు మోహన్‌రాజు, ప్రణవి, అశ్వనీ, మల్లీశ్వరి, కీర్తి, శ్రీవిద్య సిరి, శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

దేశానికి బీజేపీ చేసిందేమీ లేదు : సీపీఎం

నార్కట్‌పల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):సామాన్యులపై ధరల భారం పెంచడం, మత విద్వేషాలను రెచ్చగొట్టడం తప్ప దేశానికి బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. అవురవాణిలో శుక్రవారం నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, చెర్కు పెదులు, శ్రీరామోజు జయలక్ష్మి పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని విస్మరించి పరి పాలన కొనసాగిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని నేరడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు.

నష్టపోయిన పరిహారం అందించాలి: జూలకంటి

దామరచర్ల, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండలంలోని కేజేఆర్ కాలనీ, దిలావర్‌పూర్ గ్రామాల్లో అకాల వర్షాలతో నేలకొరిగి పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వ హించి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు అందిం చేలా కృషి చేయాలన్నారు మల్లేష్, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ఆటో డ్రైవర్ మృతి

కేతేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ మృతి చెందాడు సంఘటన శుక్రవారం 65వ నెంబరు జాతీయ రహదారిపై కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామ పరిధిలో జరిగింది. విజయవాడకు చెందిన షేక్‌బాషా(34) తన అశోక్ లేలాండ్ ఆటోను నడుపుకుంటూ హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఆటో కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామ శివారులోకి రాగానే అదే వైపునకు వెళ్తున్న విజయవాడ ఆటోనగర్ ఆర్టీసీ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పిన ఆటో రోడ్డు పక్కకు దూసుకెళ్లి పడిపోయింది. ఈ క్రమంలో ఆటో నడుపుతున్న షేక్‌బాషా ఆటో నుంచి కింద పడిపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కేతేపల్లి ఎస్‌ఐ ఎ.శివతేజ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ప్రమాదంలో మృతి చెందిన షేక్‌బాషా మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ శివతేజ వివరించారు.

'పద్మశాలీల సమస్యలను పరిష్కారానికి కృషి'



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

రామగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపోలు దత్త గణేష్ అన్నారు. శుక్రవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీలందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సత్తనారాయణ, ప్రధాన కార్యదర్శి కర్నాటి యాదగిరి, రాపోలు సతీష్‌కుమార్, ఉపాధ్యక్షులు రాపోలు శర్వయ్య, మిర్యాల వెంకటేశం, పట్టణాధ్యక్షుడు మిర్యాలస్వామి, యూత్ అధ్యక్షులు పెండెం ధనుంజయ్య, దేవరకొండ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సిరందాసు కృష్ణయ్య, వనం చంద్రశేఖర్, పున్న రమేష్, యోగానందం, జెల్లా దశరథ, గంజి నాగరాజు, పొట్టబత్తుల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు

' చండూరులోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయాలి'

చండూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చండూరులో ప్రభుత్వ సమీకృత పాఠశాలను ఏర్పాటు చేయాలంటూ మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామానికి చెందిన యువకుడు మహేష్ గాడ్పే శుక్రవారం చండూరు లో ధర్నా చేపట్టారు. చండూరు రెవెన్యూ అయినందున ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ ఇక్కడే ఉన్నప్పటికీ మునుగోడు ఎందుకు తరలించారని ఆయన ప్రశ్నించారు. ఇక్కడ ప్రభుత్వ విద్యాసంస్థలు లేకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూర మవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం...

● మర్రిగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మండలకేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అర్హులైన ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం మర్రిగూడ మండలాధ్యక్షుడు నాగవరం శ్రీనివాసరావు, హెచ్‌ఎం కళా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు.

● హాలియా, అక్టోబర్ 25: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని శుక్రవారం సాగర్ ఎమ్మెల్యే కుం దూరు జైవీర్‌రెడ్డికి కళాశాల సిబ్బంది వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల కోసం డ్యూయల్ డెస్క్ బెంచీలు, అసాంఘిక కార్య కలాపాలు జరగకుండా కళాశాలకు ప్రహరీ నిర్మాణం, నైట్ వాచ్ మెన్, స్వీపర్ల నియామకం, కళాశాలలో తరగతి గదులకు తలుపులు, ఎలక్ట్రికల్, ఫ్యాన్లు ఏర్పాటు చేయా లని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు నిధ ులను మంజూరు చేయాలని శుక్రవారం జిల్లా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అన్ని మండల కేంద్రాల్లో తాహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రం అందజేశారు.

● మాడ్గులపల్లి, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన బొల్లికొండ కృష్ణ అనుమతులు లేకుండా ఇసుకను తరలించడంతో పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. కృష్ణ, ట్రాక్టర్ డ్రైవర్ అవిరెండ్ల కిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

అలసత్వాన్ని ఉపేక్షించేది లేదు

(5వ పేజీ తరువాయి)

కెపాసిటీని పెంచేందుకు హై కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వ్యవసాయ కనెక్షన్ మంజూరులో జాప్యం జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి

ఎస్ఈ: అలాంటిది ఏమిలేదు. జిల్లాలో సుమారు 12వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వాటి లో సుమారు 10వేలకు పైగా ఎస్టిమేషన్లు పూర్తయ్యా యి. అందులో 6,500 మంజూరు కాగా, వాటిలో 3వేలకు పైగా పనులు జరుగుతున్నాయి.

ఆం: బదిలీల ప్రక్రియ సజావుగా ముగిసిందా?

ఎస్ఈ: ఇటీవల నిర్వహించిన ఉద్యోగుల బదీల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాం. ఎక్కడా, ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా సంస్థ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు బదిలీలు నిర్వహించాం.

ఆం: కొత్తగా సబ్‌స్టేషన్ల నిర్మాణం చేస్తున్నారా?

ఎస్ఈ: 2024-25 సంవత్సరానికి సంబంధించి జిల్లాకు కొత్తగా 25 సబ్‌స్టేషన్లు మంజురయ్యాయి. వీటి లో కొన్నింటికి స్థల సేకరణ జరుగుతుండగా, మరికొన్నింటి పనులు ప్రారంభమయ్యాయి. ఐదు చోట్ల పనులు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయి. వచ్చే యాసంగికి వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

ఆం: ట్రాన్స్‌ఫార్మర్లల మరమ్మతు కేంద్రాల్లో డబ్బు తీసుకుంటున్నారని ఆరోపణలపై మీ చర్యలేంటి?

ఎస్ఈ: ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రాల్లో ఎలాంటి డబ్బు చెలించాల్సిన అవసరం లేదు. ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తేఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయాలి.

ఆం: సంస్థలో అవినీతి ఆరోపణలు రాకుండా తీసుకుంటున్న చర్యలేంటి?

ఎస్ఈ: విద్యుత్‌శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడేవారు ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదు. ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేయాలి.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

(5వ పేజీ తరువాయి)

అదునుగా దళారులు రైతుల వద్ద పత్తిని నేరుగా కొనుగోలు చేసి మద్దతు ధర ఎగ్గొడుతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని దళారులు తక్కువ ధరకు పత్తి కొనుగోలు చేస్తున్నారు. దీంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వరంగ సంస్థలు రంగంలోకి దిగకపోతే దళారులు ఆడిందే ఆటగా మారనుంది. దళారులు రైతుల వద్ద పాస్‌పుస్తకాల జిరాక్స్ ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ ఖాతా నెంబర్ తీసుకుని సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిచాక రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని మద్దతు ధరకు విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు సమాచారం. రైతుల పేరుతో పత్తిని విక్రయించేందుకు దళారులు చేసిన ప్రయత్నాన్ని అధికారులు అడ్డుకోవాల్సి ఉంది. ఓ వైపు ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండగా, మరోవైపు సీసీఐ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఈ సీజన్‌లో 6.50లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి సాగైంది. వర్షాలు సకాలంలో కురవడంతో ఎకరాకు 10క్వింటాళ్ల మేర పత్తి దిగుబడి వచ్చింది. అదనంగా ఎకరాకు మరో రెండు క్వింటాలు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇంత పెద్ద ఎత్తున దిగుబడి వస్తున్నా, ప్రభుత్వరంగ సంస్థలు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కొనుగోళ్లు ప్రారంభించాలని కోరుతున్నారు.